క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కడియం: విద్యుత్ సరఫరాకు **శుక్రవారం అంత**రాయం కలుగుతుందని ఆ **శాఖ ఈఈ నటరా**జన్ తెలిపారు. జేగురుపాడు **పంచాయతీ పరి**ధిలోని పాములమెట్ట 33/11 **కేవీ సబ్‌స్టేషన్** నుంచి వచ్చే జేహెచ్‌సీ ఫీడ**ర్‌కు కొత్త కండక్ట**ర్‌ను మార్చే పనులు **చేపడతారన్నారు.** ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులు జరుగుతాయని, ఈ మేరకు సరఫరా ఉండదన్నారు. ఈ ఫీడర్ పరిధిలోని చైతన్యనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, రామదాసు పేపర్‌మిల్లు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు

కడియం: మండలం పరిధిలో కొత్తగా 128 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ కె.రమేష్ తెలిపారు. వీటిని త్వరలోనే పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

ప్రపంచ శాంతికి ప్రార్థనలు



ప్రపంచ శాంతికి ప్రార్థనలు చేస్తున్న దైవసేవకులు

కడియం: దామిరెడ్డిపల్లిలోని రెవ డి.రత్నరాజు బైబిలు మిషన్ ప్రార్థనా మందిరంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రత్నరాజుతో కలసి ఏడుగురు ప్రపంచ శాంతి, సర్వ మానవాళి సంక్షేమం కోసం ప్రార్థించారు. దైవ సేవకులు రత్నదీప్, కె.మోహన్, ప్రేమ్‌కుమార్, బి.అబ్రహం, కె.శామ్యూల్, షాలెంరాజు, మనోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ బుచ్చయ్యనగర్‌లో రూ.2.50 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. స్థానికంగా మంచినీటి సమస్యపై ఎమ్మెల్యేకు మహిళలు వివరించారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సరళవందనం, మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధవారం స్థానిక నారాయణపురంలో రూ.3.41 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్, ఎమ్మెల్సీ వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు.

నేడు బస్‌పాస్‌ల పంపిణీ కౌంటర్‌కు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: బస్ పాస్ అప్లికేషన్ ఆధునీకరణ జరుగుతున్నందున 12వ తేదీ గురువారం నుంచి జారీ చేయాల్సిన కౌంటర్ 13వ తేదీ శుక్రవారం నుంచి పనిచేస్తుందని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆర్టీసీ ప్రజాపంపిణీ అధికారి వై.సత్యనారాయణ మూర్తి బుధవారం తెలిపారు. విద్యార్థులు కొత్త బస్ పాస్‌లను ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చన్నారు. ఆర్టీసీ బస్‌పాస్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్ నింపి బస్సు పాస్ కౌంటర్ వద్ద ఇస్తే విద్యార్థులకు సమయం ఆదా అవుతుందన్నారు.

చదువుల కోవెలలో బీరు బాటిల్



శాటిలైట్‌సిటీ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం గదిలో పగిలిన బీరు బాటిల్

రాజమహేంద్రవరం రూరల్: వేసవి సెలవుల్లో పాఠశాలలను మందుబాబులు విచ్చలవిడిగా వాడుకున్నారు. దీనికి ఉదాహరణే శాటిలైట్‌సిటీ గ్రామంలో సి–బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–3లో ప్రధానోపాధ్యాయుడు గదిలో పగిలిన బీరు బాటిల్. గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో తరగతి గదులను శుభ్రం చేయించేందుకు ప్రధానోపాధ్యాయుడు ఎం.కృష్ణ బుధవారం పాఠశాలకు వెళ్లారు. తీరా చూస్తే ఆయన గదిలో పగిలిన బీరు బాటిల్ దర్శనమిచ్చింది. మద్యం మత్తులో మందుబాబులు ఈ ఆగడాలకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బంక్ కొడితే అడగండి!

- పెట్రోల్ బంకుల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి
- లేకుంటే ఫిర్యాదు చేయవచ్చు



నగరంలో పెట్రోల్ బంక్



వాహన టైర్లకు ఉచితంగా గాలి పెడుతున్న సిబ్బంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంటుంది. ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుంతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు లేకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 23 ఉండగా, రూరల్ పరిధిలోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో ఈ సేవలు కానరావడం లేదు. కొన్ని బంక్‌ల్లో టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల గాలి యంత్రాలు పనిచేయడం లేదు. పెట్రోల్ కొట్టించుకున్న తరువాత గాలి పెట్టించుకోవాలంటే సిబ్బంది లేరని సమాధానం చెబుతున్నారు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. బంక్‌ల వద్ద స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. అది చాలాచోట్ల కానరావడం లేదు.

ఇవి ఉండాల్సిందే..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చాలాచోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నామని గుర్తించుకోవాలని అధికారులు అంటున్నారు.

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

గాలి ఉచితంగానే...

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

సరైన అవగాహన లేక..



బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారులు దీని కోసం సదస్సులు నిర్వహించాలి. సేవలన్నింటికీ కలిపి చమురు ధరలో రుసుల వినియోగదారులు చెల్లిస్తున్నా.. వాస్తవానికి అవి అందుబాటులో ఉండడం లేదు. దీనికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే.

– చీర్ల సీతారామానాయుడు, రాజమహేంద్రవరం

నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఐఏఏవీఓ సభ్యులు

సీటీఆర్ఐ: అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఇండియన్ యాక్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యుడు బహదూర్షా కృష్ణచైతన్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీ సెంటర్‌లోని గోతుల్లో మనుషులు, జీవాలు చనిపోతున్నా, నగరం మధ్యలో డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు రోగాల పాలవుతున్నా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో' బంగారం పోయిందని ఫిర్యాదు చేస్తున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అక్రమ కేసులు కట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసు, ఇరిగేషన్, వైద్య శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు మాట్లాడుతూ అధికారుల్లో జవాబుదారీ తనం లేదని, పాలనలో పారదర్శకత నశించిందన్నారు. చట్ట ప్రకారం న్యాయం కోసం వచ్చే పౌరులపై అక్రమ కేసులు బనాయించి, వాస్తవాలను తప్పు దోవపట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంతోష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం

కోరుకొండ: కాపవరం సూర్యమహాలక్ష్మి ట్రేడర్స్ రైస్‌మిల్లులో పనిచేస్తూ జట్టు కూలీలు జాజుల వెంకన్న, ఆకుల శ్రీరామ్, బలసాని అన్నవరం సత్యనారాయణ మృతి చెందగా, ఆ కుటుంబాలకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. ఏప్రిల్ 12న విద్యుదాఘాతానికి గురై ఆ ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాలకు, యాజమాన్యానికి జరిగిన ఒప్పందంలో భాగంగా రూ.15 లక్షల చొప్పున పరిహారంగా ఇచ్చేందుకు అంగీకరించారు. ఇందులో రూ.లక్షను ప్రమాదం జరిగిన మరుసటి రోజు అందజేశారు. కాగా మిగిలిన రూ.14 లక్ష చొప్పున పరిహారాన్ని చెక్కుల రూపంలో మృతుల కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కాపవరం సర్పంచ్ జాజుల రాము, మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను, రైస్‌మిల్లు యజమానుల సంఘ అధ్యక్షుడు వల్లేపల్లి శ్రీనివాస్, సంబంధిత మిల్లు యజమాని బీశెట్టి గణపతి పాల్గొన్నారు.

భూముల యాజమాన్యంపై శిక్షణ

రాజానగరం: సమస్యాత్మక భూములను తగిన యాజమాన్య పద్ధతులను అనుసరించి సాగులోకి తీసుకువస్తే, మంచి దిగుబడులు పొందవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో వ్యవసాయ పరపతి సంఘం డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 'సమస్యాత్మక భూములు– సవరణలు' అనే అంశంపై బుధవారం శిక్షణ తరగతులు జరిగాయి. అమ్ల, చౌడు, కారు చౌడు భూములను గుర్తించే విధానం, లక్షణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం మట్టి, సాగునీటి పరీక్షలు, భూమి హెల్త్ కార్డుల గురించి ప్రయోగాత్మకంగా ట్రైనీలకు అవగాహన కలిగించారు. అలాగే ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సులో సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇచ్చారు.

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి



యోగాసనాలు వేస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజమహేద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ వద్ద బుధవారం యోగాంధ్ర– 2025 కార్యక్రమం జరిగింది. ఇందులో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ టి.సీతారామమూర్తి పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు యోగా, వ్యాయామం చేయటం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న యోగాసనాల కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఆరోగ్యాంధ్ర సాకార దిశగా ముందుకెళ్తున్నామని, ఇదే స్ఫూర్తితో ఈ నెల 21న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా అడుగు లేద్దామన్నారు. అనంతరం డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ సీతా రామమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా ఈ నెల 21 వరకూ జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. చివరి రోజున జిల్లాలో 5 లక్షల మందితో 50కి పైగా ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14న మాక్‌డ్రిల్ నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో బాల బాలికలను చేర్పించండి

సీటీఆర్ఐ: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాల బాలికలను చేర్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ చైర్మన్ కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ ఉచిత విద్య అందించాలని ఒక మంచి ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రోత్సహించే వారని అన్నారు. ప్రతి ఒక్కరూ చదవాలి.. భవిష్యత్తు మారాలనే నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలందరినీ ప్రభుత్వ విద్యాలయాల వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. ఆ బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులందరూ తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాల రాష్ట్ర నాయకుడు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది



తొర్రేడులో ఏరువాక కార్యక్రమంలో నాగలి ఎద్దులతో దుక్కు దున్నుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఆకలి తీర్చే రైతన్నల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని రాజమహేంద్రవరం రూరల్ మండల వ్యవసాయ అధికారి భీమరాజు అన్నారు. ఏరువాక పున్నమి సందర్భంగా బుధవారం తొర్రేడులో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి భీమరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు మూడు పంటలు పండించి అధిక ఆదాయాన్ని పొందాలని వ్యవసాయ అధికారులు సూచించారు. దళారుల నుంచి విముక్తి కలిగించి రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే రైతు ఆనందంగా ఉంటారని తొర్రేడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వేణుమాధవ్, పీటర్, తొర్రేడు వ్యవసాయ కమిటీ సభ్యులు దాసరి రామచంద్రరావు, చిట్టూరి శ్రీధర్, దండమూడి వీర్రాజు, మద్దూకూరి లక్ష్మణ్, వాసు, మల్లిన మురళి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నిర్బంధ విద్య రాజ్యాంగ హక్కు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల సిబ్బంది, ఆశవర్కర్లు

కంబాలచెరువు: స్థానికంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ఏ, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ వయసులో ఉన్న పిల్లలు విద్యాభ్యాసానికి దూరం కాకూడదని, వివిధ కారణాలతో ప్రాథమిక విద్యకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి వారిని బడికి పంపించే దిశగా చర్యలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ శాఖల సమన్వయ కృషితో పిల్లలను కాపాడి వారికి అవసరమైన సహాయం అందించాలన్నారు. చిన్నారులకు మంచి విద్య, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ పథకాలు బాల దివ్యాంగులకు అందించే దిశగా అధికారులు చూడాలన్నారు. అనంతరం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చట్టపరమైన హక్కులపై ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలన్నారు. వారికి ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా సంస్థకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రి డాక్టర్ హరిచంద్ర, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ లీగల్ ఆఫీసర్ శ్రీగౌరి, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ వి.శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారి కనకబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జి.మామిడాడలో రూ.11.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. రాజుపాలెంలో దేవీ ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఎన్డీఏ నాయకులు జుత్తుక సూర్యకుమారి, రావడ నాగు, తమలంపూడి శివరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జోరు వాన



వర్షంతో మోరంపూడి ప్లై ఓవర్ కింద ఆగిన వాహనాలు



వ్యాన్‌పై ఉన్న సామగ్రికి బరకం కప్పుతున్న దృశ్యం





వర్షంలో ఇక్కట్లు ఇలా..

రాజమహేంద్రవరం రూరల్: నాలుగు రోజులుగా సూర్యుని ప్రతాపానికి అల్లాడిపోయిన ప్రజలకు బుధవారం మధ్యాహ్నం జోరున కురిసిన వర్షం ఆహ్లాదపరిచింది. అయితే వాహనచోదకులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో అటుగా వెళ్తున్న ప్రజలు మోరంపూడి ఫ్లైఓవర్ కిందకు చేరారు. సుమారు గంటపాటు పడిన వానకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.